

శిథిల భవనాలు..

ఏళ్ల క్రితం నిర్మించిన ప్రభుత్వ పాఠశాలల పాత భవనాలు శిథిలావస్థకు చేరి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. 10లో▸



సెల్‌ఫోన్ పోయిందా..

కేంద్రం ప్రవేశ పెట్టిన సీఈఐఆర్ పోర్టల్‌తో సెల్‌ఫోన్ చోరీ కేసులను పోలీసులు సులభంగా ఛేదిస్తున్నారు. 10లో▸



అప్రమత్తత అవసరం

వేసవిలో అగ్నిప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. 11లో▸

న్యూస్‌రీల్

21 నుంచి ప్రాక్టికల్స్

అనంతగిరి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ మొదటి సంవత్సరం సైన్స్ విద్యార్థులకు ఈ నెల 21 నుంచి ప్రాక్టికల్స్ ఉంటాయని ఎస్‌ఏపీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మందారిక, సెంటర్ కోఆర్డినేటర్ మల్లారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, కంప్యూటర్ అప్లికేషన్స్ సబ్జెక్టులు చదువుతున్న వారికి మాత్రమే ప్రాక్టికల్స్ ఉంటాయని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు తరగతులు ఉంటాయని వెల్లడించారు. మరిన్ని వివరాలకు 9440512625 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

భువనగిరి కోటపై ఎర్రజెండా ఎగరాలి

సీపీఎం ఎంపీ అభ్యర్థి జహంగీర్



సమావేశంలో మాట్లాడుతున్న జహంగీర్

తుర్కయంజాల్: ప్రజా పోరాటాలకు కేంద్ర బిందువైన భువనగిరి కోటపై ఎర్ర జెండా ఎగరాలని, లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కమ్యూనిస్టుల త్యాగాలు, పోరాటాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తుర్కయంజాల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు డి.కిషన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సానుభూతిపరుల విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చే కుట్ర పన్నుతుందని ఆరోపించారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి, కార్పొరేట్, పెట్టుబడిదారులకు ఊడిగం చేసే పనిలో ఉన్నారని, దీనికి నిదర్శనం ఇటీవల బయటపడ్డ ఎలక్ట్రోరల్ బాండ్లేనని అన్నారు. ఇప్పటికే సీఏఏ, పౌరసత్వ రద్దు, జ్యోతిష్య శాస్త్ర అమలు విద్యా కాషాయీకరణతో పాటు ఈడీ, సీబీఐ లాంటి సంస్థలను ఉపయోగించి ప్రతిపక్షాలను బెదిరించడం, లొంగదీసుకోవడం, మేధావులను జైల్లో పెట్టడం లాంటివి బలవంతంగా అమలు చేస్తోందని దుయ్యబట్టారు. ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే నిరంతరం ప్రజా ఉద్యమాలు చేసే సీపీఎం అభ్యర్థిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేశ్, జిల్లా కమిటీ సభ్యుడు ఇ. నర్సింహ, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎం.జె.ప్రకాష్ కారత్, నాయకులు ఎం.సత్యనారాయణ, కె.అరుణ్ కుమార్, ఐ.భాస్కర్, కె. శారద, శంకర్, శంకరయ్య పాల్గొన్నారు.

'కోడ్' ఉల్లంఘిస్తే చర్యలు

తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి



వాహనాలను తనిఖీ చేస్తున్న డీఎస్పీ

తాండూరు: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి, అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి హెచ్చరించారు. ఆదివారం తాండూరు పట్టణం ఇందిరాచౌక్‌లో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో భద్రతా పరమైన ఏర్పాట్లను పటిష్టంగా చేపడుతున్నామని తెలిపారు. వాహనాలలో రూ.50వేలకు మించి తీసుకెళ్లకూడదని, తీసుకెళ్లినట్లయితే సంబంధిత పత్రాలను దగ్గర ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ సంతోష్‌కుమార్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ మధ్యే పోటీ

కాంగ్రెస్ మహబూబ్‌నగర్ అభ్యర్థి వంశీచంద్ రెడ్డి

కొందుర్గు: బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా బీజేపీకి తొత్తుగా మారిందని, ప్రస్తుతం బీజేపీ, కాంగ్రెస్ మధ్యే పోటీ ఉందని కాంగ్రెస్ మహబూబ్‌నగర్ లోక్‌సభ అభ్యర్థి వంశీచంద్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మతతత్వ బీజేపీని ఓడించి పేద, బడుగు, బలహీన వర్గాల కాంగ్రెస్‌ను ఆశీర్వదించాలని కోరారు. బీజేపీ అభ్యర్థి డీకే అరుణ కాంగ్రెస్‌లో మంత్రిగా ఉండి, పార్టీ అధికారం కోల్పోయిన వెంటనే బీజేపీకి అమ్ముడుపోయి సీఎం రేవంత్ రెడ్డిని విమర్శించడం ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నట్టు చెప్పారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీగా వంశీచందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కానుకగా ఇద్దామని పిలుపునిచ్చారు.



అనంతగిరి: వికారాబాద్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సభాపతి ప్రసాద్‌కుమార్ తదితరులు

విశ్వమానవుడు అంబేడ్కర్

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరి వాడని, ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని వక్తలు అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా సకల జనులు ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. కులవివక్ష లేని సమాజ స్థాపన కోసం అంబేడ్కర్ ఎంతో కృషి చేశారని తెలిపారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడ్డారని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని నిర్మించి, ప్రపంచంలోనే ఉత్తమమైన రాజ్యాంగాన్ని దేశానికి అందించిన గొప్ప మహనీయుడని కొనియాడారు. ఆయన ఆశయాలు సదా ఆచరణీయమైనవని, అంబేడ్కర్ చూపిన మార్గంలో నడుచుకోవాలని సూచించారు. – సాక్షి, నెట్‌వర్క్



వికారాబాద్‌లో నివాళులర్పిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి

సోషల్ హంగామా



ఫేస్‌బుక్‌లో అభ్యర్థుల ఫొటోలతో పోలింగ్

- ఎగ్జిట్ పోల్స్ తరహాలో నేతల భవితవ్యం తెలుసుకునే ప్రయత్నం
- లోక్‌సభ ఎన్నికల వేళ పోటాపోటీ ప్రచారం
- అన్ని నియోజకవర్గాల్లో అదే పరిస్థితి

వికారాబాద్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సామాజిక మాధ్యమాల వేదికగా పోటాపోటీగా రాజకీయ నాయకుల పోస్టుల హవా కొనసాగుతోంది. ప్రత్యేక ప్రోగ్రామ్స్‌లో పాల్గొనే సెలబ్రెటీలు తమ విజయం కోసం ఒపీనియన్ పోల్‌కు వెళ్లినట్లుగా నాయకులు సైతం తమ బలాబలాలు తెలుసుకునేందుకు ఇదే తరహా ఆలోచనలు మొదలు పెట్టారు.. ఇందు కోసం ఫేస్‌బుక్‌ను అస్త్రంగా ఉపయోగించుకుంటున్నారు. ప్రచారంలో అందివచ్చిన ఏ అవకాశాన్ని నాయకులు వదులుకోవడం లేదు. ప్రచారంతో పాటు తమ విజయావకాశాలు ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు తహతహలాడుతున్నారు. పోలింగ్, ఎగ్జిట్‌పోల్స్‌కు చాలా సమయం ఉన్నందున తమ భవిష్యత్ ఎలా ఉండబోతోంది అని తెలుసుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఇందులో భాగంగా ఫేస్‌బుక్ వేదికగా ఓటింగ్ ప్రక్రియకు తెరతీశారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఇదే తరహా వాతావరణం నెలకొంది. ఒకప్పుడు రచ్చబండలు రాజకీయాలకు వేదికలు.. ఇప్పుడు ఈ పాత్రను సోషల్ మీడియా పోషిస్తోంది. ఎన్నికలు వచ్చాయంటే నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సోషల్ మీడియాలో తెగ పోస్టులు పెట్టేస్తున్నారు. ఉన్నవి, లేనివి వైరల్ చేస్తూ హంగామా చేస్తున్నారు. చేతిలో మొబైల్ ఫోన్ ఉంటే చాలు లోక్‌సభ అభ్యర్థుల పేర్లతో ఎగ్జిట్ పోల్స్‌ను కొనసాగుతున్నారు. 2014 సార్వత్రిక ఎన్నికల నాటికే ఫోన్లు విస్తృతంగా అందుబాటులోకి వచ్చినా స్మార్ట్ ఫోన్ల వాడకం అంతగా లేకపోవడంతో సోషల్ వార్ కనిపించలేదు. కేవలం ఎస్ఎంఎస్‌ల ద్వారా తమ అభిప్రాయాలను పంచుకునే వారు. 2018–19 ఎన్నికల నాటికి స్మార్ట్ ఫోన్ల వాడకం పెరిగింది. దీంతో యువత ఎన్నికల చాటింగులు, షేరింగులతో బిజీగా ఉంటున్నారు. ఆయా పార్టీల ద్వారా టికెట్ దక్కించుకుని బరిలో నిలిచిన వారిపై ఆన్‌లైన్ ఓటింగ్ పెడుతున్నారు. ఒక రోజు.. ఓ గంట.. లేదా ఐదు రోజుల పాటు ఈ పోలింగ్ నిర్వహించి వచ్చిన ఓట్ల ఆధారంగా ఓ పార్టీపై మరో పార్టీ నేతలు కామెంట్లు చేస్తూ సోషల్ వార్ సృష్టిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ఈ తరహా కామెంట్లు వివాదాలకు దారితీస్తున్నాయి. వచ్చిన ఫలితాలను సోషల్ మీడియా వేదికగా చర్చలు, కామెంట్లు చేస్తున్నారు.

అన్ని నియోజకవర్గాల్లో..

లోక్‌సభ ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండటంతో చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో పార్టీల నేతల మధ్య సోషల్ వార్ కొనసాగుతోంది. ప్రధానంగా బీఆర్ఎస్ చేవెళ్ల అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిల పేర్లతో ఫేస్‌బుక్‌లో ఓటింగ్ నిర్వహిస్తున్నారు. ప్రధాన పార్టీలతో పాటు ఇతర పార్టీల అభ్యర్థుల పేర్లను సైతం అక్కడక్కడ ఆయా పార్టీలు, అభ్యర్థుల అభిమానులు నిత్యం ఓటింగ్ నిర్వహిస్తూ సోషల్ వార్‌కు తెరతీస్తున్నారు. తమ పార్టీ అభ్యర్థులు, అభిమాన నేతల బలాబలాలు ప్రదర్శిస్తున్నారు. ఓటు వేసేలా ముందు స్నేహితులను, కార్యకర్తలను అప్రమత్తం చేస్తున్నారు.

కొన్ని సందర్భాల్లో సెల్ఫ్ గోల్

సోషల్ మీడియాలో పోలింగ్ నిర్వహించేవారు తమ అభిమాన నేతలకు ఎక్కువ ఓట్లు పోలయ్యే ప్లాన్ చేస్తున్నారు. ఇందుకోసం వారి గ్రూపులోని సభ్యులందరినీ అప్రమత్తం చేస్తున్నట్లు సమాచారం. ఇలా చేయడం ద్వారా తమ నేతకు విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయని జనాల్లోకి తీసుకెళ్లడం ద్వారా ప్రయోజనం పొందాలని చూస్తున్నారు. అయితే కొన్ని సందర్భాల్లో ఈ ప్లాన్‌ని పక్క పార్టీల వారు పసిగట్టి వారి నేతకు ఎక్కువ ఓట్లు పడేలా చూస్తున్నారు. దీంతో పోలింగ్ పెట్టిన వారికి పార్టీ నేతల నుంచి చివాట్లు తినాల్సి వస్తోంది.

పార్టీల దృష్టి

సోషల్ మీడియా ప్రాధాన్యత పెరిగిన నేపథ్యంలో ప్రధాన పార్టీలు, అభ్యర్థులు ఆన్‌లైన్ ఓటింగ్‌పై దృష్టి సారించారు. ఇది యువతను ప్రభావితం చేసే విషయం కావటంతో ఆన్‌లైన్ వ్యవహారాల్లో పట్టున్న యువకులను ఎంపిక చేసి వారికి ఉద్యోగాలిచ్చి పోలింగ్ నిర్వహిస్తున్నారు. ఇందుకోసం వాట్సాప్, ట్విట్టర్, ఫేస్‌బుక్‌ల్లో ప్రత్యేక గ్రూపులను నిర్వహిస్తున్నారు.



సభలో మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

దేశ సంక్షేమమే బీజేపీ లక్ష్యం

- గ్యారంటీల పేరుతో మోసం చేసిన కాంగ్రెస్
- మోదీని మరోసారి గెలిపించుకుందాం
- బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

యాలాల: దేశ సంక్షేమమే బీజేపీ లక్ష్యమని, ప్రజల కోసం 24 గంటలు పని చేస్తున్న ప్రధాని మోదీని మరోసారి గెలిపించుకుందామని ఆ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం యాలాల మండల పరిధి ఫంక్షన్ హాలులో బీజేపీ మండల అధ్యక్షుడు జంగం యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన ప్రసంగించారు. ప్రతి పంచాయతీలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో అధిక శాతం కేంద్ర ప్రభుత్వ నిధులే ఉన్నాయని తెలిపారు. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని, కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ సర్కార్ ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. పింఛన్ల పెంపు, మహిళలకు రూ.2,500 పింఛన్లు, రైతు రుణమాఫీ, రైతుబంధు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. గతంలో ఉపాధి కూలీ రూ.150 ఉండగా.. బీజేపీ రూ.300కు పెంచిందని వెల్లడించారు.

అత్యధిక స్థానాల్లో గెలుస్తాం..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. మోదీని పెద్దన్నగా పేర్కొంటూ కేంద్రం నుంచి రాష్ట్రానికి రూ.9 వేల కోట్ల నిధులను తెచ్చుకున్నారని, రాష్ట్రాల అభివృద్ధిలో బీజేపీ పక్షపాతం చూపడం లేదనడానికి ఇదే నిదర్శనమని కొండా స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా అత్యధిక స్థానాల్లో బీజేపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ముందు అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కొండా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, జిల్లా నాయకులు రమేష్‌కుమార్, అసెంబ్లీ కన్వీనర్ రజినీకాంత్, మున్సిపల్ మాజీ చైర్మన్ నాగారం నర్సింలు, నాయకులు నరేష్ మహరాజ్, పటేల్ విజయ్‌కుమార్, వెంకటేశ్, అరుణ్, మధుగౌడ్ తదితరులు ఉన్నారు.

'పొలిటికల్' ఆతిథ్యం!



ఉదయం ఆత్మీయ సభలు.. సాయంత్రం విందు, వినోదాలు

- అపార్ట్‌మెంట్లు, కాలనీ సంక్షేమ సంఘాలతో భేటీ
- కన్వెన్షన్లు, ద్వితీయ శ్రేణి నేతల ఇళ్లు, ఆఫీసుల్లో సిట్టింగ్‌లు
- ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు పోటాపోటీగా ఏర్పాట్లు

రంగారెడ్డి జిల్లా: లోక్‌సభ ఎన్నికలకు సరిగ్గా 28 రోజులే మిగిలి ఉంది. ఓటింగ్ సమయం దగ్గరపడుతోంది. గ్రేటర్ జిల్లాల పరిధిలోని మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్, చేవెళ్ల, హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని అన్ని పార్టీల అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఒక వైపు పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ..మరో వైపు వీలైనంత త్వరగా ఓటర్లను చేరుకునేందుకు యత్నిస్తున్నారు. ఉదయం ఇతర పార్టీల కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానిస్తూ, వారికి కండువా కప్పడం, మధ్యాహ్నంబూత్, గ్రామ, మండల స్థాయి కమిటీలతో ఆత్మీయ సభలు, సమావేశాలు నిర్వహించి, ఎన్నికల్లో గెలుపు కోసం సమాలోచనలు చేయడం, సాయంత్రం ఏడు తర్వాత ముఖ్య అనుచరుల నివాసాలు, గెస్ట్ హౌసులు, ఆఫీసులు, హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్లు, ఫాం హౌసుల్లో గెట్ టు గెదర్ పార్టీలు ఏర్పాటు చేస్తున్నారు. కాలనీ, అపార్ట్‌మెంట్, గెటెడ్ కమ్యూనిటీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, యువజన సంఘాలు, ఉద్యోగ, కార్మిక సంఘాల ప్రతినిధులను ఆహ్వానిస్తున్నారు. వివిధ రకాల మాంసాహార వంటకాలతో పాటు ఖరీదైన మద్యం బాటిళ్లను సరఫరా చేస్తున్నారు. ఒక వైపు అభ్యర్థి గెలుపునకు ఏ విధంగా కృషి చేయాలనే అంశంపై చర్చిస్తూనే..మరో వైపు 'సుక్క..ముక్క'తో ఓటర్లను తమ వైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు.

రాజకీయ దావత్‌లు షురూ..

ఒకే చోట ఎక్కువ మంది కూడితే ఎన్నికల కమిషన్‌కు అనుమానం వస్తుందని భావించి, పోలింగ్ బూత్‌ల వారిగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుండటం గమనార్హం. పోలీసులకు ఏమాత్రం అనుమానం రాకుండా పుట్టిన రోజు వేడుకల బ్యానర్లను, కేకు, పుష్పగుచ్ఛాలను ఆ ప్రదేశంలో రెడీగా ఉంచుతున్నారు. ఇదిలా ఉంటే ఎన్నికల్లో ప్రచారం కోసం బంధువులు, స్వగ్రామాలకు చెందిన వారిని కూడా నియోజకవర్గానికి రప్పించి, వారితో మంతనాలు జరుపుతున్నారు. స్థానికంగా స్థిరపడిన వారి బంధువుల ఓట్లు తమకే పడేలా ప్లాన్ చేస్తున్నారు. కనీసం ఏ ఒక్క రోజు కూడా పలకరించని నేతలు ఏకంగా ఇంటికి, గెస్ట్‌హౌస్‌కు, హోటల్‌కు, క్యాంపు ఆఫీసుకు పిలిపించుకుని విజయం కోసం పాటు పడాల్సిందిగా వేడుకుంటున్నారు. లీడర్లు కూడా దీన్ని అవకాశంగా తీసుకుంటున్నారు. అభ్యర్థుల ముందు అనేక ప్రతిపాదనలను పెడుతున్నారు. సామాజిక వర్గం, హోదా, సంస్థాగతంగా ప్రజల్లో తనకు ఉన్న పలుకు బడికి ఓ రేటు నిర్ణయిస్తున్నారు. విధిలేని పరిస్థితుల్లో అభ్యర్థులు కూడా వారి డిమాండ్లకు అంగీకరిస్తున్నారు. ముఖ్యంగా చేవెళ్ల, మల్కాజ్‌గిరి నియోజకవర్గాల్లోని ద్వితీయ శ్రేణి లీడర్లకు ఫుల్ డిమాండ్ ఏర్పడింది. వారు అడిగినంత ఇచ్చి వారిని పార్టీలో చేర్చుకుంటున్నట్లు తెలిసింది.

మద్యం షాపులతో ఒప్పందం

ఎన్నికల్లో మద్యం పంపిణీని నియంత్రించేందుకు ఎన్నికల కమిషన్ గట్టి చర్యలే చేపట్టింది. గెట్ టు గెదర్ పార్టీలకు నేరుగా మద్యం సరఫరా చేస్తే పోలీసులు పట్టుకునే అవకాశం ఉండటంతో అభ్యర్థులు ఎవరికీ అనుమానం రాకుండా ముందే తమ అనుచరులు, బంధువులు, బినామీల పేరుతో ఉన్న వైన్స్‌లతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆ మేరకు ప్రత్యేకంగా టోకెన్లను కూడా ముద్రించి ఇస్తున్నారు. అభ్యర్థి వెంట రోజంతా తిరిగిన ముఖ్య అనుచరులతో పాటు ఇతర నిర్వాహకులకు సాయంత్రం వేళ టోకెన్లు జారీ చేస్తున్నారు. వీరు ఆయా వైన్సుల వద్దకు వెళ్లి..కావాల్సినంత మద్యాన్ని వెంట తీసుకెళ్తున్నారు. ఆత్మీయ సభలు, సమావేశాలకు హాజరయ్యే వారికి కూడా ఇదే విధంగా పంపిణీ చేస్తున్నారు. ఎక్సైజ్‌శాఖ జిల్లాలోని వైన్స్‌షాపుల్లోని నిల్వలను ఏ రోజుకారోజు లెక్కిస్తున్నప్పటికీ.. వీరి లెక్కకు ఏమాత్రం కూడా చిక్కకుండా వ్యవహరిస్తుండటం విశేషం. అంతేకాదు కాలనీ సంక్షేమ సంఘాల ఆధ్వర్య ంలో ఏర్పాటు చేసే సమావేశాలకు హాజరయిన సభ్యులను బట్టి బాటిళ్లను, బిర్యానీ పొట్లాలను పంపిణీ చేస్తుండటం గమనార్హం.

మతం పేరుతో రాజకీయం

- ప్రజలను మభ్యపెడుతున్న బీజేపీ
- కాంగ్రెస్ పాలన కోరుకుంటున్న ప్రజలు
- చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

పరిగి: 'పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజలకు చేసిందేమీ లేదు. రెండు సార్లు మతం, శ్రీరాముడి పేరుతో రాజకీయం చేసి, అధికారంలోకి వచ్చింది. ఈ సారి ఆ పార్టీ ఆటలు ఇక సాగవు' అని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన పూడూరు మండలం రాకంచర్ల నుంచి పరిగి పట్టణం మీదుగా మిట్టకోడూర్ గ్రామం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా పట్టణ కేంద్రంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీ మాట్లాడారు. కాంగ్రెస్ బలం బలగం ఎంటో బీజేపీకి ఇప్పుడిప్పుడే తెలుస్తుందని, గత ఎన్నికల్లోనే హస్తం సత్తా ఎంటో రాష్ట్ర ప్రజలు చూపించారని, ఈ ఎన్నికల్లోనూ అదే జోరు కొనసాగనుందని స్పష్టం చేశారు. బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గతంలో చేవెళ్ల ఎంపీగా పని చేసి, ప్రజలకు ఎలాంటి సేవలందించారో, తాను ఎలాంటి సేవలు చేశానో ప్రజలే గుర్తించాలన్నారు. దేవుడి పేరుతో ఆ పార్టీ నేతలు ఓట్లు అడుగుతున్నారని, ఈ ఎన్నికల్లో 400 సీట్లు వస్తాయని ప్రచారం చేస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజలు వారిని నమ్మే స్థితిలో లేరని చెప్పారు.

నిరుద్యోగం పెంచిన కేంద్రం

దేశ ప్రజలు కాంగ్రెస్ పాలనను కోరుకుంటున్నారని, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత పార్టీ దేశాన్ని ఎంతో అభివృద్ధి చేసిందని ఎంపీ స్పష్టం చేశారు. పేదల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం చేపడితే.. బీజేపీ సర్కార్.. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతుందని ఆరోపించారు. అధికారంలోకి వస్తే 20కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పిన మోదీ.. ఇప్పటి వరకు కోటి కొలువులు కూడా ఇవ్వలేదని, ఆ పార్టీతోనే దేశంలో నిరుద్యోగం పెరిగిందని విమర్శించారు. ఎన్నికల సమయం సమీపిస్తుందని, పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేసి, పార్టీ గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

హామీలను నెరవేరుస్తాం: ఎమ్మెల్యే టీఆర్ఆర్

ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం నెరవేరుస్తుందని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేసిందని తెలిపారు. కాంగ్రెస్ అంటేనే ప్రజా సంక్షేమం అని, పార్టీని గెలిపించి అభివృద్ధిని ఆస్వాదించాలని కోరారు. డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, కద్మూర్ ఆనందం, ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్, పార్టీ మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, సీనియర్ నాయకులు రాఘవేందర్‌రెడ్డి, యాదయ్యగౌడ్, శ్రీనివాస్ ఉన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

బీఆర్ఎస్ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్‌రెడ్డి

కొత్తూరు: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మహబూబ్‌నగర్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. కొత్తూరు పట్టణంలో ఆదివారం నిర్వహించిన కొత్తూరు, నందిగామ మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి వంద రోజులు దాటుతున్నా ఎందుకు అమలు చేయడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. బీఆర్ఎస్ పాలనలోనే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందినట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధిని మరిచి కేవలం తమ పబ్బం గుడుపుకోవడానికి కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్‌పై ఆరోపణలు చేస్తోందని ధ్వజమెత్తారు. బ్లాక్ మెయిలింగ్ పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాపారులు, ఇతర పార్టీల నాయకుల నుంచి రూ.కోట్లు దండుకుంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాలనపై ప్రజల్లో అప్పుడే తీవ్రమైన వ్యతిరేకత వచ్చిందన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కచ్చితంగా బీఆర్ఎస్ ఎంపీలు విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని నాయకులు, కార్యకర్తలు ప్రజలకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, నాయకులు ఈట గణేశ్, బాతుక లావణ్య, ఎమ్మె శ్రీలత, రాజ్యలక్ష్మి, సత్యనారాయణ, మెండె కృష్ణ, పద్మారెడ్డి, పెంటనోళ్ల యాదగిరి, రాజావరప్రసాద్, ఎల్గనమోని రవీందర్‌యాదవ్, నారాయణరెడ్డి, రాంబాల్‌నాయక్, దేవేందర్‌యాదవ్, పద్మారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్‌రెడ్డి

క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ దైవభక్తిని అలవర్చుకోవాలి

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

బషీరాబాద్: మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం మహా పడి పూజ వైభవంగా నిర్వహించారు. స్వామివారి పుట్టిన రోజు సందర్భంగా ఆలయ కమిటీ పడి పూజ చేపట్టింది. దీనికి తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దైవభక్తికి కలిగి ఉండాలని అన్నారు. భక్తితో మానసిక ప్రశాంతత ఏర్పడుతుందన్నారు. బషీరాబాద్‌లో పెద్దాలయం నిర్మించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో సాయిలు గౌడ్, రోహిత్‌మహరాజ్, డాక్టర్ సంపత్‌కుమార్, పవన్ ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కట్టమైసమ్మ బోనాలు



బోనమెత్తిన సాయిపూర్ మహిళలు

తాండూరు టౌన్: పట్టణం సాయిపూర్‌లోని కట్టమైసమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి బోనాలు ఘనంగా సమర్పించారు. స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, కౌన్సిలర్లు రత్నమాల నర్సింహులు, నీరజాబాల్‌రెడ్డి, స్థానిక నాయకులు బొట్టు నర్సింహులు, వేణుగోపాల్, మల్లప్ప తదితరులు ఉన్నారు.

వృద్ధురాలి మెడలోంచి పుస్తెలతాడు అపహరణ

ఇబ్రహీంపట్నం రూరల్: వృద్ధురాలి మెడలో నుంచి ఓ దుండగుడు బంగారు పుస్తెలతాడును అపహరించిన సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. తుర్కయంజాల్ మున్సిపాలిటీ సూరజ్‌నగర్‌లో నివాసం ఉండే నెలపట్ల కమలమ్మ(75) తెల్లవారు జామున లేచింది. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి చొరబడి కరెంట్ తీగను కత్తిరించి విద్యుత్‌ను నిలిపివేశాడు. ఈ క్రమంలో వృద్ధురాలి మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు పుస్తెల తాడు కత్తిరించుకొని పారిపోయాడు. దీంతో ఆమె లబోదిబోమని విలపించింది. స్థానికుల సహకారంతో ఆదిబట్ల పోలీసులకు సమాచారం ఇచ్చింది. వృద్ధురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిగల ద్రోహి'

కవాడిగూడ: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పట్ల ఏమాత్రం గౌరవం లేదని మంద కృష్ణమాదిగ అన్నారు. ఆదివారం ఆయన లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు ఉదయం 8గంటల్లోగా అంబేడ్కర్ జయంతి వేడుకలలో పాల్గొనేవారన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉదయం 11.40 వరకు అంబేడ్కర్‌కు నివాళులర్పించకపోవడం ఆయనకు అంబేడ్కర్ పై ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతుందన్నారు. ముఖ్యమంత్రి మాదిగలను చిన్న చూపు చూస్తూ వారు రాజకీయంగా ఎదగకుండా అడ్డుకుంటున్నారని మందకృష్ణ ఆరోపించారు. పార్లమెంటు ఎన్నికల్లో మూడు ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాల్లో ఒక్కటి కూడా మాదిగలకు కేటాయించకపోవడం మాదిగలపై కాంగ్రెస్ పార్టీ వివక్షకు నిదర్శనమన్నారు.

శిథిల భవనాలు.. ప్రమాద ఘంటికలు



జనగాంలో శిథిలావస్థకు చేరిన సర్కారు బడి



ఓంలానాయక్ తండాలో పాడుబడిన పాఠశాల

- పాత గోడల మధ్య కొనసాగుతున్న చదువులు
- గదులు లేక ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- నూతన భవనాలు మంజూరు చేయాలని మొర

పెద్దేముల్: ఏళ్ల క్రితం నిర్మించిన భవనాలు ప్రస్తుతం కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో పాత భవనాలు శిథిలావస్థకు చేరి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. వాటిని కూల్చి నూతన భవనాలు మంజూరు చేయాలని ఆయా గ్రామస్తులు విన్నవిస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. దీంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ ఆ గదుల్లోనే చదువులు సాగిస్తున్నారు. వారికి సరిపడా భవనాలు లేక ఒకే గదిలో ఒకటి నుంచి ఐదు తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని పాలకులకు, అధికారులకు అనేకసార్లు అర్జీ పెట్టినా స్పందన లేదు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి కొత్త భవనాలు మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వసతులు కరువు

మండలంలోని 37 గ్రామ పంచాయతీల్లో మొత్తం 61 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ప్రైమరీ పాఠశాలల్లో-1850 మంది, యూపీఎస్ పాఠశాలల్లో-496, ఉన్నత పాఠశాలల్లో-2046 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కానీ ఏ ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో వసతులు లేవు. దుగ్గాపూర్, సిద్ధన్నమడుగుతండా, ఆత్మార్‌తండా, పెద్దేముల్ బీసీ కోట్ల, దారుణివాగుతండా, నర్సాపూర్, ఒంటిమామిడి, రచ్చకట్టతండా, రాంసింగ్‌తండాతో పాటు తదితర తండాలు ఒకే గదిలో పాఠశాలలు నడుస్తున్నాయి. వాటికి ఒక ఉపాధ్యాయుడితోనే బోధన కొనసాగుతున్నాయి. గతంలో నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేసి ప్రమదకరంగా మారాయి. వర్షాకాలంలో విద్యార్థులు నానా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. గోడలు నానిపోయి భవనాలు కూలే ప్రమాదం పొంచి ఉంది. పదేళ్ల నుంచి కొత్త భవనాలు మంజూరు చేయాలని కోరినా ఉన్నతాధికారుల నుంచి స్పందన లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం పాత భవనాలు స్థానంలో కొత్త వాటిని నిర్మించాలని మండలంలోని ఆయా గ్రామస్తులు వేడుకుంటున్నారు.

నివేదిక అందజేశాం



మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గదుల కొరత ఉందని ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు నివేదిక అందజేశాం. పలు గ్రామాల్లో పాఠశాలలు శిథిలావస్థకు చేరిన విషయం వాస్తవం. మరికొన్ని బడుల్లో సరిపడా గదులు లేక ఒకే గదిలో విద్యార్థులకు బోధన నిర్వహిస్తున్నాం. ఆయా గ్రామాల ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు సమస్యను మా దృష్టికి తీసుకొచ్చారు.

– వెంకటయ్య, ఎంఈఓ, పెద్దేముల్

ఎండిన పంటల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..



మంబాపూర్‌లో వరి పంటను పరిశీలిస్తున్న ఏఈఓ

పెద్దేముల్: అడుగంటిన భూగర్భ నీటిపై 'పాతాళానికి జలం' అనే శీర్షికతో ఆదివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని మంబాపూర్ గ్రామంలో ఏఈఓ బాలు పర్యటించారు. రైతులు ఆనందం, సుజ్ఞాని, శాంతమ్మలకు సంబంధించిన వరి పంటను పరిశీలించారు. ఆనందంకు చెందిన మూడు ఎకరాల్లో రెండు ఎకరాలు పూర్తిగా ఎండి పోయింది. సుజ్ఞాని, శాంతమ్మలకు చెందిన రెండు ఎకరాలకు పైగా వరి పంట ఎండినట్లు ఏఈఓ గుర్తించారు. ప్రస్తుతం ఆనందం పొలానికి పక్క రైతు ముకుందరెడ్డి బోరు నుంచి సాగు నీరు ఇచ్చేటట్లు ఏఈఓ ఒప్పించారు. జనగాం గ్రామంలో పొడైన వరి పంటలకు కోటపల్లి ప్రాజెక్టు నీరును విడుదల చేస్తామని ఏఈఓ బాలు తెలిపారు. మండలంలో పంటలు పొడై అప్పుల పాలవుతున్న రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి

మహేశ్వరం: కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో వత్తుల రఘుపతి కాంప్లెక్స్‌లో మండల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకెళ్లి కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. కొత్త, పాత నాయకులు అనే తారతమ్యం లేకుండా అందరూ సమష్టిగా పని చేసి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మండలంలో కాంగ్రెస్ బలంగా ఉందన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి కార్యకర్త ప్రజల్లోలోకి తీసుకెళ్లి చైతన్య పరచాలన్నారు. ఇటీవల తుక్కుగూడలో విడుదల చేసిన కాంగ్రెస్ మేనిఫెస్టో ఐదు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. బీజేపీ మత విద్వేషాలు, బీఆర్ఎస్ కుల రాజకీయాలు చేస్తూ రెచ్చ గొడుతుందన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు చిత్తుగా ఓడిపోవడం ఖాయమన్నారు. మండలాన్ని నాలుగు క్లస్టర్లుగా మహేశ్వరం, అమీర్‌పేట్, నాగారం, కొల్లపడకల్‌ను విభజించామన్నారు. కార్యక్రమంలో నాయకులు నిజాం, రఘుమారెడ్డి, సునీతానాయక్, ఈశ్వర్‌ముదిరాజ్, యాదయ్య, ఇజ్రాయేల్, రఘుపతి, రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

వీరశైవుల సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్యే నారాయణరెడ్డిని సన్మానించిన వీరశైవ లింగాయత్ సంఘం సభ్యులు

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: వీరశైవ లింగాయత్ లింగ బలిజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. జిల్లా వీరశైవ లింగాయత్ సమాజం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మిర్యాణం అనిల్‌కుమార్‌తో పాటు, సంఘం కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం మండల కేంద్రంలోని శివాలయంలో నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంగమేశ్వర్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెన్న ఈశ్వరప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వీరశైవ లింగాయత్ లింగ బలిజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. వీరశైవులు అన్ని రంగాల్లో రాణించేందుకు ప్రభుత్వం తోడ్పాటు ఇస్తుందన్నారు. మండల కేంద్రంలో వీరశైవ లింగాయత్ భవన నిర్మాణానికి సహాయ సహకారాలు అందిస్తానని ప్రకటించారు. అనంతరం సంగమేశ్వర్, ఈశ్వరప్పలు మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వీరశైవ లింగాయత్ లింగ బలిజల అభివృద్ధికి పెద్దపీట వేయాలని కోరారు. అతిథులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, నాయకులు తతరులు పాల్గొన్నారు.

నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందించాలి

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ విద్యుత్ రంగ సంస్థల అభివృద్ధి కోసం, వచ్చే వేసవి విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని రైతాంగానికి, అన్ని వర్గాల ప్రజలకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ఉద్యోగులు కృషి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం జూబ్లిహిల్స్‌లోని నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డిని విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్(వీఏఓఏ) ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం వారికి పలు సూచనలు చేశారు. కరెంట్ సరఫరాలో అంతరాయాలకు ఆస్కారం ఇవ్వొద్దని, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడంలో అధికారులు సహకరించాలని సూచించారు. సీఎంను కలిసిన వారిలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య, పరమేష్, తదితర ప్రతినిధులు ఉన్నారు.

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్ట్

రూ. 1.96 లక్షల నగదు స్వాధీనం

మియాపూర్: ఐపీఎల్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. సీఐ దుర్గరామలింగప్రసాద్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మియాపూర్ మాతృశ్రీ నగర్ కాలనీలో ఆన్‌లైన్‌లో ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో శనివారం రాత్రి మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు, మియాపూర్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. శాంతికుమార్, కొత్త విజయ్‌భాస్కర్‌రెడ్డి, సమీర్ ఫిరానీ అనే వ్యక్తులు ఆన్‌లైన్‌లో బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1,9 లక్షల నగదు, నాలుగు స్మార్ట్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

నేటితో ముగియనున్న ఓటరు నమోదు

- ఇప్పటికే తుది జాబితా విడుదల చేసిన ఈసీ
- జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య 9,84,068
- ఈ నెల 25న అనుబంధ జాబితా



ఓటరు ఐడీని చూపుతున్న యువత

వికారాబాద్: ఓటరుగా నమోదు చేసుకునేందుకు నేటితో గడువు ముగియనుందని, అర్హులై ఉండి, ఓటరుగా నమోదు చేసుకోని వారు ఈ ఆఖరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఫారం 12 (పోస్టల్ బ్యాలెట్ కోసం) దరఖాస్తు చేసుకునేందుకు గడువు మాత్రం ఈ నెల 15తో ముగుస్తుందని పేర్కొన్నారు.

శిక్షణ పూర్తి

పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఈసీ ఆదేశాల మేరకు అధికారులు, జిల్లా యంత్రాంగం ఎన్నికల కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగానే ఇప్పటికే ఓటరు తుది జాబితా విడుదల చేయగా.. గడువు ముగిసిన నాటికి వచ్చిన దరఖాస్తులు క్రోడీకరించి అనుబంధ జాబితాను నామినేషన్ల చివరి తేదీ ఈ నెల 25న విడుదల చేయనున్నారు. ఈ నెల 18న లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో ఈవీఎంల రెండో విడత ర్యాండమైజేషన్, సాక్షిగ్రేషన్ పూర్తి చేసిన అధికారులు.. జిల్లా కేంద్రంలోని ఈవీఎంలను స్ట్రాంగ్ రూం నుంచి నియోజకవర్గ కేంద్రాల్లోని స్ట్రాంగ్‌రూంలకు తరలించారు. జిల్లాలో మొత్తం 9,84,068 ఓటర్లు, 1,148 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఎన్నికల విధులు నిర్వహించనున్న ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ సైతం ఇప్పటికే పూర్తి చేశారు.

జిల్లాలో ఓటర్లు

ఎన్నికల కమిషన్ ఇప్పటికే ఓటర్ల తుది జాబితాను ప్రకటించింది. ప్రస్తుతం తాజా సమాచారం మేరకు జిల్లాలో మొత్తం ఓటర్లు 9,84,068 ఉండగా, వీరిలో పురుషులు 4,86,109, స్త్రీలు 4,97,220, ఇతరులు 39 మంది ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే.. వికారాబాద్‌లో మొత్తం ఓటర్లు 2,31,679 ఉండగా, పురుషులు 1,15,019 మంది, మహిళలు 1,16,647, ట్రాన్స్ జెండర్లు 13 ఉన్నారు. తాండూరులో మొత్తం 2,43,849 మంది ఉండగా, పురుషులు 1,18,228 మంది, మహిళలు 1,25,614, ఇతరులు 07 ఉన్నారు. పరిగిలో మొత్తం 2,66,273 మంది ఉండగా, పురుషులు 1,33,625, మహిళలు 1,32,639, 09 మంది ట్రాన్స్ జెండర్లు ఉన్నారు. కొడంగల్‌లో మొత్తం 2,42,267 మంది ఉండగా, పురుషులు 1,19,237, మహిళలు 1,23,020 మంది, ట్రాన్స్ జెండర్లు 10 మంది ఉన్నారు.

ఓటర్లు పెరిగే అవకాశం

ఫిబ్రవరి 8న ఈసీ ఓటరు తుది జాబితా విడుదల చేయగా.. ఈ నెల 18న అనుబంధ జాబితా విడుదల చేయనున్నారు. ఇందుకోసం అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఓటరు తుది జాబితా తరువాత ఇప్పటి వరకు అధికారులు ఓటు నమోదుకోసం స్వీకరించిన దరఖాస్తులతో అనుబంధ జాబితాలో మరో 20 వేల వరకు ఓటర్లు పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే విడుదల చేసిన లిస్ట్ ప్రకారం జిల్లాలో 9,84,068 మంది ఓటర్లు ఉండగా అనుబంధ జాబితాలో 16వేల ఓటర్లు పెరిగినా జిల్లా ఓటర్ల సంఖ్య 10 లక్షల మైలురాయిని దాటనుంది. జిల్లాలో ఇప్పటికే యువ ఓటర్లు ఎక్కువగా ఉండగా, ప్రస్తుతం అనుబంధ జాబితాలో పెరగనున్న ఓటర్లలో ఎక్కువ శాతం యువ ఓటర్లే ఉన్నారు. ఈ నేపథ్యంలో ఏ పార్టీకి లాభం చేకూరనుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

సెల్‌ఫోన్ పోయిందా.. దిగులు వద్దు

సీఈఐఆర్ పోర్టల్‌తో ఆచూకీ లభ్యం

- షాద్‌నగర్ పరిధిలో పలు చోరీ కేసులను ఛేదించిన పోలీసులు



ఇటీవల బాధితులకు ఫోన్‌లను అప్పగించిన పోలీసులు

షాద్‌నగర్: ప్రపంచాన్ని అరచేతిలో చూపించే సెల్‌ఫోన్ ప్రతి ఒక్కరి జీవితంలో కీలకంగా మారింది. గంటల కొద్ది మాటలు.. సామాజిక మాధ్యమాల్లో ఆటవిడుపులు.. డిజిటల్ లావాదేవీలు.. ఇలా అన్నింటికీ సెల్‌ఫోనే ఆధారం. దీన్ని విడిచి నిమిషం ఉండలేని పరిస్థితి ప్రస్తుతం నెలకొంది. అలాంటిది చోరీకి గురైతే తిరిగి పొందటం కష్టంగా ఉండేది. కానీ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ చోరీ కేసులను పోలీసులు సులభంగా ఛేదిస్తున్నారు.

నూతన పోర్టల్‌కు శ్రీకారం

చోరీకి గురైన సెల్‌ఫోన్‌లను గుర్తించేందుకు సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్‌ను రూపొందించింది. ఇది కేంద్ర ప్రభుత్వం టెలీ కమ్యూనికేషన్ విభాగం ఆధీనంలో పని చేస్తుంది. ఇది సెల్‌ఫోన్ గుర్తించడంలో కీలకంగా వ్యవహరిస్తుంది. ఈ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పొందవచ్చు.

నమోదు ఇలా

సెల్‌ఫోన్ చోరీ అయితే వెంటనే సమీపంలో ఉన్న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. ఐఎంఈఐ(ఇంటర్నేషనల్ మొబైల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ) నంబర్ ఆధారంగా చోరీ అయిన ఫోన్ లభించే అవకాశం ఉంటుంది. ఇందుకు గాను ఫోన్ పోయిన వెంటనే పోర్టల్ వెబ్‌సైట్‌లో లాగిన్ కావాలి. ఫోన్‌ను బ్లాక్ చేసేందుకు రిక్వెస్ట్ వస్తుంది. దాన్ని ఎంచుకున్నాకా ఫోన్ మోడల్, కంపెనీ, ఐఎంఈఐ సంఖ్య, బిల్లు వివరాలు నమోదు చేయాలి. ఫోన్ ఎక్కడ పోయిందో ఆయా వివరాలు, ఫిర్యాదు నమోదు చేయాలి. బాధితుడి పేరు, చిరునామా, గుర్తింపు పత్రం, ఓటీపీ కోసం సెల్‌ఫోన్ నంబర్, ఈమెయిల్ ఐడీ నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తి అవ్వగానే ఐడీ నంబర్ వస్తుంది. వివరాలు పోర్టల్‌లో నమోదు చేసిన తర్వాత సెల్‌ఫోన్ పని చేయకుండా బ్లాక్ చేస్తారు. ఎవరు సెల్‌ఫోన్ వినియోగించారో గుర్తించేందుకు పోలీసులు నిఘా పెడతారు. సీఈఐఆర్ పోర్టల్‌లో సమాచారం తెలుసుకుంటారు. అనంతరం బాధితులను పిలిపించి వారికి అందజేస్తారు. తిరిగి దొరికిన సెల్‌ఫోన్‌ను ఐడీ నంబర్ ద్వారా తిరిగి అన్‌బ్లాక్ చేసుకొని ఉపయోగించవచ్చు.

బాధితులకు ఊరట

లక్షలు, వేలు రూపాయలు పెట్టి కొనుగోలు చేసిన ఫోన్ చోరీకి గురైందంటే బాధితుల ఆవేదన అంతా ఇంతా కాదు. చోరీ అయితే ఫోన్ తిరిగి దొరకడం కష్టమనే భావన గతంలో అందరికీ ఉండేది. కేంద్ర ప్రభుత్వం కొత్త పోర్టల్ తీసుకొచ్చినప్పటి నుంచి బాధితులకు ఊరట కలుగుతుంది. సెల్‌ఫోన్ పోయిన కొద్ది రోజుల్లోనే లభ్యం అవుతుంది.

80 ఫోన్ల రికవరీ

తమ ఫోన్లు చోరీకి గురయ్యాయని చాలా మంది బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు. ఫిర్యాదులు అందుకున్న పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ సహాయంతో సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. వేల రూపాయల విలువ చేసే సుమారు 80 సెల్‌ఫోన్‌లను ఇటీవల పోలీసులు రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. చోరీకి గురైన మరిన్ని సెల్‌ఫోన్‌లను త్వరలో రికవరీ చేస్తున్నట్లు వాటిని త్వరలో అందజేస్తామని పోలీసులు తెలిపారు.

ఇక దొరకదనుకున్నా



వేల రూపాయలు పెట్టి కొనుగోలు చేసిన కొన్ని రోజులకే ఫోన్ చోరీ అయింది. వెంటనే ఠాణాలో ఫిర్యాదు చేశాను. ఫోన్ ఇక దొరకదేమోనని అనుకున్నాను. ఫోన్‌ను వెతికి తిరిగి నాకు అప్పగించిన పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు.

– నాగరాజు, న్యూసిటీ కాలనీ, షాద్‌నగర్

టెక్నాలజీతో సత్ఫలితాలు




సెల్‌ఫోన్ చోరీ అయినా దిగులు చెందాల్సిన అవసరం లేదు. బాధితులు వెంటనే ఠాణాలో ఫిర్యాదు చేయాలి. సీఈఐఆర్ పోర్టల్ సహాయంతో శోధిస్తే ఫోన్ ఎక్కడ ఉందో తెలుస్తుంది. ఇప్పటి వరకు సుమారు 80 ఫోన్‌లు అప్పగించాం.

– రామిరెడ్డి, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్, షాద్‌నగర్

నేడు కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశం

అబ్దుల్లాపూర్‌మెట్: భువనగిరి లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశాన్ని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అధ్యక్షతన తుర్కయంజాల్‌లోని బీఎంఆర్ సార్థ కన్వెన్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌గౌడ్ తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డిలు హాజరు కానున్నారన్నారు. సమావేశానికి నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని ఆయన కోరారు.

రాములుకు సాహితీ వేదిక పురస్కారం



రాములు దంపతులను సత్కరిస్తున్న నిర్వహకులు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని రావిర్యాల ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు రాములుకు తెలుగు వెలుగు జాతీయ సాహితీ వేదిక ఉగాది పురస్కారం అందజేసింది. వేదిక నిర్వహకులు ఆదివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రాములు దంపతులను శాలువలు, పూల మాలలతో సత్కరించారు. కళలు, నాటకాలు, ప ద్యాలు తదితర అంశాల్లో పాల్గొనడంతో పాటు విద్యార్థులకు కళలపై అవగాహన కల్పిస్తున్న సందర్భంగా తనకి ఈ పురస్కారం అందించినట్లు రాములు పేర్కొన్నారు.

నీట్ పరీక్షల భయంతో విద్యార్థి ఆత్మహత్య



జైస్వాల్ (ఫైల్)

కుత్బుల్లాపూర్: నీట్ పరీక్షల భయంతో ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..స్ప్రింగ్‌ఫీల్డ్ కాలనీ, చంద్రోదయ రెసిడెన్సీలో ఉంటున్న అరవింద్ జైస్వాల్ కుమారుడు పియూష్ జైస్వాల్ (22) నీట్ పరీక్షకు సన్నద్ధమవుతున్నాడు. శనివారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి ఐపీఎల్ మ్యాచ్ చూసిన పియూష్ అనంతరం నిద్రకు ఉపక్రమించాడు. అదే రోజు రాత్రి అరవింద్ జైస్వాల్ భార్యకు పీయూష్ స్నేహితుడు ఫోన్ చేశాడు. తమ స్టూడెంట్స్ గ్రూప్‌లో పీయూష్ తాను నీట్ పరీక్షకు సరిగా చదవలేకపోతున్నానని, సూసైడ్ చేసుకుంటున్నట్లు పోస్ట్ పెట్టాడని చెప్పాడు. దీంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు బాల్కనీలోకి వెళ్లి చూడగా అప్పటికే అతను భవనం ఐదవ అంతస్తు నుంచి కిందకు దూకాడు. అతడిని సమీపంలోని ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.